క్లుప్తంగా

గోపాల్‌పేటలో రైతుల రాస్తారోకో



నాగిరెడ్డిపేట: గ్రామాల్లో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో వెంటనే ధాన్యం సేకరణను ప్రారంభించాలని కోరుతూ గోపాల్‌పేటలో రైతులు శుక్రవారం రాస్తారోకో నిర్వహించారు. విషయం తెలుసుకున్న ఎస్సై మల్లారెడ్డి ఘటన స్థలానికి చేరుకొని వారిని సముదాయించి రాస్తారోకోను విరమింపజేశారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. మాజీ ఎంపీపీ రాజ్‌దాస్, మాజీ జడ్పీటీసీ మనోహర్‌రెడ్డి, కృష్ణ, దుర్గారెడ్డి, వంశీగౌడ్, పరిశోధన్‌రెడ్డి, దేవీసింగ్, కిష్టయ్య తదితరులు పాల్గొన్నారు.

తీరిన లోవోల్టేజీ సమస్య



మాచారెడ్డి: మండలంలోని అక్కాపూర్‌లో లోవోల్టేజీ సమస్య తీరిందని గ్రామస్తులు తెలిపారు. కొన్ని రోజులుగా లోవోల్టేజీ సమస్యతో వ్యవసాయ మోటార్లు కాలిపోతున్నాయని ఉన్నతాధికారులకు విన్నవించడంతో స్పందించిన అధికారులు సమస్యను పరిష్కరించారని పేర్కొన్నారు. ట్రాన్స్‌కో అధికారులు శుక్రవారం అదనపు ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేశారు. దీంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. గ్రామస్తులు డీఈ కళ్యాణచక్రవర్తి, ఏడీఈ నరేశ్ కుమార్, ఏఈ తిరుపతిరెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు.

సమాచార హక్కు చట్టం వజ్రాయుధం లాంటిది



భిక్కనూరు: సమాచార హక్కు చట్టం ప్రజల చేతిలో వజ్రాయుధం లాంటిదని సమాచార హక్కు పరిరక్షణ కమిటీ రాష్ట్ర డైరెక్టర్ సలీం అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో నిర్వహించిన సమాచార చట్టంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఈవో రాజ్‌గంగారెడ్డి, సమాచార హక్కు పరిరక్షణ కమిటీ ప్రతినిధులు నవీన్‌గౌడ్, శ్రీనివాస్‌రావు, రాజు, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

కబ్జా స్థలం పరిశీలన



బిచ్కుంద: మండల కేంద్రంలోని రాజుల్లా చౌరస్తాలో రామ మందిరం స్థలం కబ్జాకు గురికావడంతో ఎండోమెంట్ అధికారులు, సర్వేయర్ శుక్రవారం పరిశీలించారు. మందిరానికి సంబంధించిన 2.22 గుంటల భూమి కొందరు ఆక్రమించి ఇళ్ల నిర్మాణాలు చేపట్టారు గ్రామస్తులు, ఆలయ చైర్మన్ ఫిర్యాదు మేరకు విచారణ చేపడుతున్నట్లు ఎండోమెంట్ అధికారి సుదర్శన్ పేర్కొన్నారు. సర్వేయర్ హద్దులు నిర్ణయించారు. గ్రామ పెద్దల సమక్షంలో సర్వే చేసి హద్దులు వేస్తున్నట్లు తెలిపారు. మాజీ చైర్మన్ హాజి బాల్‌రాజ్ ఉన్నారు.

పరిసరాల పరిశుభ్రతపై దృష్టి సారించాలి



సదాశివనగర్: పరిసరాల పరిశుభ్రతపై జీపీ కార్యదర్శులు దృష్టి సారించాలని ఎంపీడీవో సంతోష్‌కుమార్ సూచించారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. గ్రామాల వారిగా సమీక్ష చేపట్టారు. గ్రామాల్లో మురికి కాలువలను శుభ్రం చేయించడం, పిచ్చి మొక్కల తొలగింపు, పల్లెప్రకృతి వనాల పర్యవేక్షణపై దృష్టి పెట్టాలన్నారు. ఎంపీవో సురేందర్ రెడ్డి, జీపీల కార్యదర్శులు పాల్గొన్నారు.

ఓటు హక్కు కల్పించాలి

కామారెడ్డి టౌన్: ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎస్జీటీలకు ఓటు హక్కు కల్పించడంలో రాష్ట్ర ప్రభుత్వం సానుకూలంగా స్పందించాలని ఎస్జీటీ ఉపాధ్యాయుల సంఘం జిల్లా నాయకుడు సంతోష్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కేంద్ర ఎన్నికల సంఘం, రాష్ట్ర ఎన్నికల సంఘానికి ఆదేశాలు జారిచేయడంపై సంతోషం వ్యక్తం చేశారు. సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలని కోరారు.

కొండెక్కిన కూరగాయల ధరలు

సామాన్యులు బెంబేలు

- అనూహ్యంగా పెరిగిన ధరలతో ఇబ్బంది పడుతున్న ప్రజలు

ఎల్లారెడ్డిరూరల్: కూరగాయల ధరలు కొండెక్కాయి. అకాల వర్షాలతో మార్కెట్‌లో కూరగాయల ధరలు భగ్గుమంటున్నాయి. దీంతో పేద, మధ్యతరగతి కుటుంబాలపై భారం పడుతోంది. కనీసం ఉన్నంతలో కూరగాయలు కొనలేని పరిస్థితి నెలకొంది. మరోవైపు నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరగడంతో పూట గడవని స్థితిలో వెజిటేబుల్స్ ధరలను చూసి అవాక్కవుతున్నారు. ఇక చేసేదేమి లేక మార్కెట్‌కు వెళ్లిన వినియోగదారులు తక్కువ మోతాదులో కూరగాయలు కొనుగోలు చేస్తూ కాలం వెళ్లదీస్తున్నారు.

వాతావరణంలో అనూహ్య మార్పుల కారణంగా కూరగాయల దిగుబడి పూర్తిగా పడిపోయింది.

కూరగాయలు	ధరలు (కిలో)		
పాలకూర	120	పచ్చిమిర్చి	80
కాలీఫ్లవర్	100	బీట్‌రూట్	100
క్యాబేజి	100	క్యారెట్	100
కాకరకాయ	80	బెండకాయలు	80
బీరకాయ	120	వంకాయలు	80
చిక్కుడుకాయ	80	టమాటలు	50
		ఆలుగడ్డలు	50



కిలో వందకు చేరిన కూరగాయలు

దీంతో ధరలు విపరీతంగా పెరిగాయి. మామూలు రోజుల్లో మార్కెట్‌కు వెళ్లిన వారు కిలోల చొప్పున చేసేవారు. కానీ ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. ప్రతి ఒక్కరు అర, పావు కిలోల చొప్పున కూరగాయలు కొనుగోలు చేస్తున్నారు. అదేవిధంగా ఉల్లిగడ్డ, అల్లం, వెల్లుల్లి ధరలు కూడా పెరిగాయి. ధరలు పెరగడంతో ఎవరూఆ కూరగాయలు కొనేందుకు రావడం లేదంటూ వ్యాపారులు పేర్కొంటున్నారు.

కూరగాయలు కిలో రూ. వందకు చేరుకున్నాయి. మటన్, చికెన్, గుడ్ల ధరలతో పాటు, పప్పుల ధరలు సైతం పెరిగి పోవడంతో ఏమి తినాలో అర్థం కావడం లేదని జనాభాలో ఆందోళన చెందుతున్నారు. వరుసగా కురిసిన భారీ వర్షాలతో పంటల దిగుబడి తగ్గిపోవడంతో కూరగాయల ధరలు అమాంతంగా ఆకాశాన్నంటాయి.

ఇబ్బందిగా ఉంది



కూరగాయల ధరలు బాగా పెరిగిపోయాయి. కిలో ధరలు రూ. వందకు చేరడంతో కొనడానికి ఇబ్బందిగా ఉంది. మొన్నటి వరకు రూ. 20 ఉన్న టమాటలు ఇప్పుడు రూ. 50కు చేరింది. క్యాబేజీ, క్యాలీఫ్లవర్ రూ. వంద ఉండడంతో కొనే పరిస్థితి లేకుండా పోయింది.

– వెంకవ్వ, మత్తమాల

ఏం తినేటట్టు లేదు



కూరగాయల ధరలతో పాటు, చికెన్, మటన్, గుడ్లు, పప్పుల ధరలు సైతం బాగా పెరిగి పోయాయి. దీంతో ఏం కొనేటట్టు లేదు, ఏం తినేటట్టు లే దు. జనాలకు ఉపాధి లేని స మయంలో ధరల పెరగడం ఇబ్బందిగా ఉంది. ప్రభుత్వం కూరగాయల ధరలు నియంత్రించేలా చూడాలి.

– చాకలి రాజమణి, మత్తమాల

కొనుగోలు కేంద్రాల్లో వసతులు కల్పించాలి



లింగంపేటలో కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఆర్డీవో



మహమ్మద్‌నగర్: బూర్గుల్ శివారులో..

లింగంపేట: ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో వసతులు కల్పించాలని డీఆర్డీవో, మండల ప్రత్యేకాధికారి సురేందర్ అన్నారు. మండల కేంద్రంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం పరిశీలించారు. కేంద్రాల వద్ద తాగునీటి సౌకర్యం ఏర్పాటు చేయాలని సిబ్బందికి సూచించారు. ఆరబెట్టిన ధాన్యానికి మ్యాచర్ పరిశీలించారు. అనంతరం మండల కేంద్రం సమీపంలోని కంపోస్టు షెడ్డును పరిశీలించారు. ఆయన వెంట ఎంపీవో మలహరి, కార్యదర్శి శ్రావణ్‌కుమార్, ఏపీఎం శ్రీనివాస్, ఏపీవో, సీసీ మేహర్ తదితరులు ఉన్నారు.

ధాన్యం తూకాలకు సహకరించాలి

నిజాంసాగర్: ధాన్యం కొనుగోళ్లకు రైతులు సహకరించాలని మండల ప్రత్యేక అధికారి తిరుమల ప్రసాద్ కోరారు. శుక్రవారం మహమ్మద్‌నగర్ మండలంలోని బూర్గుల్ శివారులోని కొనుగోలు కేంద్రం వద్ద ఆరబెట్టిన ధాన్యాన్ని పరిశీలించారు. పంట నూర్పిడి చేసిన తర్వాత ధాన్యాన్ని ఆరబెట్టి కొనుగోలు కేంద్రాలకు తీసుకు రావాలన్నారు. ఆయన వెంట ఎంపీడీవో గంగాధర్, మండల వ్యవసాయశాఖ అధికారి అమర్ ప్రసాద్, రైతు మనీశ్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

గాంధారి: మండలంలోని సీతాయిపల్లి, మేడిపల్లి, కరక్‌వాడి గ్రామాల్లో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను డీఆర్డీవో అదనపు పీడీ మురళీకృష్ణ, మార్కెటింగ్ డీఎం రమేశ్ బాబు, ఏఎంసీ చైర్మన్ పరమేశ్వర్ శుక్రవారం ప్రారంభించారు. రైతులు కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించి మద్దతు ధర పొందాలని సూచించారు. కార్యక్రమాల్లో ఏఎంసీ డైరెక్టర్లు, ఐకేపీ వీవోఏ గౌస్‌ఖాన్, మహిళా సంఘం సభ్యులు, రైతులు పాల్గొన్నారు.



సీతాయిపల్లిలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న అధికారులు

బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు కృషి చేయాలి

జిల్లా న్యాయమూర్తి టి నాగరాణి

కామారెడ్డి టౌన్: జిల్లాలో బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు కృషి చేయాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, జిల్లా న్యాయమూర్తి టి నాగరాణి ఆదేశించారు. జిల్లా కేంద్రంలోని కార్యాలయంలో జిల్లా కార్మిక శాఖ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఇటుక బట్టీలు, హోటళ్లు, కల్లు దుకాణాలు వివిధ ప్రాంతాల్లో బాలకార్మికులు ఉంటే గుర్తించి తగు చర్యలు తీసుకోవాలన్నారు. తల్లిదండ్రులకు, బాలకార్మికులకు కౌన్సిలింగ్ ఇవ్వాలన్నారు. అలాంటి వారిని స్థానిక బడుల్లో చేర్పించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్మిక శాఖ అసిస్టెంట్ కమిషనర్ కోటేశ్వర్లు,



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా న్యాయమూర్తి

చిన్నారుల సంరక్షణ అధికారి సంతోష్, న్యాయసేవాధికారిసంస్థ సూపరింటెండెంట్ చంద్రసేన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అనంతరం కమ్యూనిటీ మీడియేషన్ వలంటీర్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. సామరస్యంగా సమస్యలను పరిష్కరించాలని అన్నారు.

ప్రతి శుక్రవారం నిల్వనీటిని పారబోయాలి

బాన్సువాడ రూరల్: ప్రతి శుక్రవారం తమ ఇండ్లలోని పాత్రలు, వాటర్‌ట్యాంకులు, కుండీల్లో నిల్వ నీటిని పారబోసి శుభ్రపర్చాలని బాన్సువాడ మండల ప్రత్యేకాధికారి, డీఈవో రాజు అన్నారు. ఫ్రైడే–డ్రైడేలో భాగంగా బొర్లంలో పర్యటించి గ్రామస్తులకు అవగాహన కల్పించారు. నిల్వ నీటిలోనే దోమలు వృద్ధి చెందుతాయన్నారు. దోమలను నివారించడానికి ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రం, ప్రభుత్వ పాఠశాలలను తనిఖీ చేశారు. నాటిన మొక్కలను సంరక్షించాలన్నారు. ఎంపీడీవో బషీరుద్దీన్, ఎంపీవో సత్యనారాయణ, హెడ్మాస్టర్ సరఫ్ వెంకటరమణ, పంచాయతీ కార్యదర్శి సాయికుమార్, అంగన్‌వాడీ, ఆరోగ్య, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.



బొర్లంలో నిల్వ నీటిని పారబోస్తున్న అధికారులు

బీజేపీ సభ్యత్వ నమోదును విజయవంతం చేయాలి



పెద్దకొడప్‌గల్‌లో సభ్యత్వ నమోదు చేయిస్తున్న మాజీ ఎమ్మెల్యే సౌదాగర్ గంగారాం

పెద్దకొడప్‌గల్: ప్రతి ఒక్కరూ బీజేపీ సభ్యత్వ నమోదును విజయవంతం చేయాలని జుక్కల్ మాజీ ఎమ్మెల్యే సౌదాగర్ గంగారాం అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ఇంటింటికి తిరుగుతూ ఆన్‌లైన్ బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ప్రతి ఒక్కరూ బీజేపీలో సభ్యత్వం పొందాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు స్వామి యాదవ్, వెంకట్, సుభాష్ తదితరులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిలో..

ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డిలో బీజేపీ నాయకులు శుక్రవారం బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు చిన్న రాజులు, రవీందర్‌రావు, బాలకిషన్, దేవేందర్, నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

లింగంపేటలో..

లింగంపేట: మండలంలో బీజేపీ సభ్యత్వ న మోదు భారీగా పెంచాలని రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ప్రభారి నీలం చిన్న రాజు పార్టీ కార్యకర్తలకు సూచించారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో కార్యకర్తలతో మాట్లాడారు. గ్రామ స్థాయిలో సభ్యత్వ నమోదు భారీగా చేయించాలని సూచించారు. రవీందర్‌రావు, లింగారావు, దత్తురాం, గంగాధర్‌రావు, రాంచందర్, నవీన్‌కుమార్, ఉదయ్‌కుమార్, పోశెట్టి, శంకర్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

సమాచారం..

నేడు జీపీలో సామగ్రి వేలం

గాంధారి: మండల కేంద్రంలోని జీపీ కార్యాలయంలో జమ అయిన పాత సామగ్రిని శనివారం ఉదయం 10 గంటలకు వేలం నిర్వహించనున్నట్లు పంచాయతీ కార్యదర్శి నాగరాజు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పాడైన బోరు మోటార్లు, ఇనుప పైపులు, ప్లాస్టిక్ సామాను ఉందని దానికి వేలం వేయనున్నట్లు తెలిపారు. ఆసక్తి గల వారు వేలంలో పాల్గొనాలని కోరారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వాలని వినతి

నిజాంసాగర్: పెండింగ్‌లో బిల్లులు, స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను ప్రభుత్వం వెంటనే మంజూరు చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి అజయ్‌కుమార్ డిమాండ్ చేశారు. శుక్రవారం జుక్కల్ మండల కేంద్రంలో విద్యార్థులతో కలిసి ర్యాలీ చేపట్టారు. అనంతరం తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. నాయకులు ఫిర్దోస్, ఈశ్వర్, జేమల్, అక్షయ్, రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయ సంస్థ చైర్మన్‌కు..

భిక్కనూరు/ నాగిరెడ్డిపేట: నాగిరెడ్డిపేట మండలంలో గ్రంథాలయ నూతన భవనం నిర్మించాలని కోరుతూ మాజీ జడ్పీటీసీ మనోహర్‌రెడ్డి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ చంద్రకాంత్‌రెడ్డిని శుక్రవారం కలిసి వినతిపత్రం అందజేశారు. గ్రంథాలయంలో పోటీ పరీక్షలకు అవసరమైన పుస్తకాలను అందుబాటులో ఉంచాలని కోరారు. కార్యక్రమంలో నాయకుడు గోవింద్ ఉన్నారు.

వెంటనే తూకాలు ప్రారంభించాలి

సదాశివనగర్: ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించిన ప్రభుత్వం వెంటనే తూకాలు చేపట్టాలని మాజీ జెడ్పీటీసీ పడిగెల రాజేశ్వర్‌రావు అన్నారు. మండలంలోని ఆయా గ్రామాల్లో ధాన్యం కల్లాలను శుక్రవారం పరిశీలించారు. విండో చైర్మన్ కమలాకర్ రావు, బద్దం శ్రీనివాస్ రెడ్డి, వంకాయల రవి, కలాలి సాయాగౌడ్, నర్సారెడ్డి, లింబాద్రి, వంగిటి రాజు, బాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పోరాటానికి మద్దతిస్తాం

తాడ్వాయి: జీవో29ను రద్దుచేయాలని గ్రూపు–1 అభ్యర్థులు చేస్తున్న పోరాటానికి ధర్మసమాజ్ పార్టీ సంపూర్ణ మద్దతు ఇస్తుందని పార్టీ మండల అధ్యక్షుడు రాజశేఖర్ అన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వం వెంటనే పరీక్షను వాయిదా వేసి, అభ్యర్థుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

తాగునీరు కలుషితం కాకుండా చూడాలి

ఎల్లారెడ్డిరూరల్: గ్రామాల్లో తాగునీరు కలుషితం కాకుండా చూడాలని ఎంపీవో ప్రకాశ్ అన్నారు. మండలంలోని రుద్రారంలో తాగునీటిని శుక్రవారం పరీక్షించారు. తాగునీటిని క్లోరినేషన్ చేసి సరఫరా చేయాలన్నారు. పంచాయతీ కార్యదర్శి సిద్దు తదితరులు ఉన్నారు.

కార్మికులను విధుల్లోకి తీసుకోవాలి

బాన్సువాడ: బిచ్కుంద కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో పని చేసే కార్మికులను సంబంధిత కాంట్రాక్టర్ విధుల్లో నుంచి తొలగించారని, వారిని వెంటనే విధుల్లోకి తీసుకోవాలని ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు దుబాస్‌రాములు అన్నారు. బాన్సువాడ కార్మిక శాఖ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్ దావూద్‌కు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. కార్మికులకు రావాల్సిన బకాయి వేతనాలను వెంటనే చెల్లించాలన్నారు. వెంకటేశ్, ఇమ్రాన్, విఠల్, సుభాష్, శ్రద్ధ, బాలమణి తదితరులు ఉన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న రాములు

కుక్కల గుంపుతో భయం భయంగా..

మద్నూర్: కుక్కల గుంపుతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. మండల కేంద్రంలోని హౌసింగ్ బోర్డు కాలనీ, వైఎస్సార్ కాలనీలో శుక్రవారం కుక్కలు గుంపులు.. గుంపులుగా తిరుగుతుండడంతో కాలనీవాసులు భయాందోళన చెందుతున్నారు. జీపీ అధికారులు పలుమార్లు కుక్కలను పట్టుకొని తరలిస్తున్నా మళ్లీ వస్తూనే ఉన్నాయని ప్రజలు ఆవేదన చెందుతున్నారు. అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



పీఆర్టీయూ నూతన కార్యవర్గం ఎన్నిక



మద్నూర్: డోంగ్లీ మండల కేంద్రంలో పీఆర్టీయూ మండల నూతన కార్యవర్గాన్ని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు జిల్లా అధ్యక్షుడు కుషాల్ తెలిపారు. అధ్యక్షుడిగా సునీల్, ప్రధాన కార్యదర్శిగా మారుతి, అసోసియేట్ అధ్యక్షుడిగా యాదవ్‌రావు, మహిళా ఉపాధ్యక్షురాలిగా విజయలక్ష్మి, కార్యదర్శిగా సంజీవ్‌కుమార్ ఎన్నికయ్యారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఫ్రెండ్స్ యూత్ అసోసియేషన్..

పిట్లం: పిట్లం ఫ్రెండ్స్ యూత్ అసోసియేషన్ నూతన కమిటీని శుక్రవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కుమ్మరి హనుమంతరావు, ఉపాధ్యక్షులుగా కుమ్మరి యాదగిరి, మంగలి రాజు, ప్రధాన కార్యదర్శిగా బత్తిని సురేందర్, క్యాషియర్‌గా నీలకంటి సిద్ధార్థ, జాయింట్ సెక్రెటరీగా నీలకంఠ నందు, సలహాదారులుగా నీలేష్, దయానంద్, బొడ్ల రాజు, కొండరాజు, దేవల నరేశ్ ఎన్నికయ్యారు.

కంచర్ల రెడ్డి సంక్షేమ సంఘం..

భిక్కనూరు: మండలంలోని కంచర్ల రెడ్డి సంక్షేమ సంఘం నూతన కార్యవర్గాన్ని శుక్రవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మట్లే చంద్రారెడ్డి, ఉపాధ్యక్షుడిగా పెంజర్ల మల్లారెడ్డి ఎన్నికయ్యారు. వీరికి మండల రెడ్డి సంక్షేమ సంఘం అధ్యక్షుడు నరేందర్‌రెడ్డి నియామక పత్రాలను అందజేశారు. అనంతరం నరేందర్‌రెడ్డిని సభ్యులు సన్మానించారు. మాజీ ఎంపీటీసీ మోహన్‌రెడ్డి, రెడ్డి సంక్షేమ సంఘం ప్రతినిధులు కాంతంరెడ్డి, శ్యామ్‌రెడ్డి, మల్లారెడ్డి, మైపాల్‌రెడ్డి, రాజిరెడ్డి, రాంచంద్రరెడ్డి పాల్గొన్నారు.

కోర్టు ఉత్తర్వులు అమలు చేయాలని వినతి



భిక్కనూరు: బస్వాపూర్ సింగిల్‌విండోపై హైకోర్టు ఇచ్చిన ఆదేశాలను వెంటనే అమలు చేయాలని కోరుతూ సింగిల్‌విండో వైస్‌చైర్మన్ మద్ది స్వామి, డైరెక్టర్లు జిల్లా సహకార అధికారి రాంమోహన్‌కు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. వినతిపత్రం అందించిన వారిలో మద్ది స్వామి, పోతురి రాజు, గౌరిగారి సుధాకర్‌రెడ్డి, గౌరిగారి రాంరెడ్డి, అద్దంకి నర్సింలు, మోతె కిష్టారెడ్డి ఉన్నారు.

పోచారం చెక్‌పోస్ట్ తనిఖీ



నాగిరెడ్డిపేట: మండలంలోని పోచారం చెక్‌పోస్టును ఎల్లారెడ్డి మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ రజితారెడ్డి శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. చెక్‌పోస్ట్‌లోని రికార్డులను పరిశీలించారు. చెక్‌పోస్టులో ఫర్నిచర్ కొరతను తీర్చాలని స్థానికులు కోరడంతో ఆమె సానుకూలంగా స్పందించారు. దీంతో పాటు గోపాల్‌పేటలోని మార్కెట్‌యార్డు వద్ద దుకాణ సముదాయంతోపాటు వే బ్రిడ్జి నిర్మాణానికి ప్రతిపాదనలు పంపినట్లు చెప్పారు. ఆమె వెంట నాయకులు వెంకట్రాంరెడ్డి, కిరణ్ తదితరులు ఉన్నారు.

కొనసాగుతున్న భజనలు

మద్నూర్: మండల కేంద్రంలో నిత్యం వేకువజామున కార్తీకమాస భజనలు కొనసాగుతున్నాయి. మండల కేంద్రానికి చెందిన సుమారు 50 మంది భక్తులు ఉదయం ఐదు నుంచి గంటన్నర పాటు మండల కేంద్రంలోని ప్రధాన విధుల గుండా భక్తి పాటలు పాడుతు, భజనలు చేస్తు అర్చకులు శంఖం పూరిస్తూ దైవచింతన చేస్తున్నారు. మండల కేంద్రంలోని అన్ని ఆలయాలకు వెళ్లి హారతి, ప్రత్యేక పూజలు చేపడుతున్నారు. కార్తీక మాసం ముగింపు వరకు భజనలు కొనసాగుతాయని వారు పేర్కొన్నారు.

‘రైతులను ఇబ్బందులు పెడితే ఊరుకోం’

కామారెడ్డి టౌన్: వడ్ల కొనుగోలులో రైస్ మిల్లర్లు రైతులను ఇబ్బందులకు గురి చేస్తే ఊరుకునేది లేదని సీపీఎం జిల్లా కార్యదర్శి హెచ్చరించారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఎలాంటి షరతులు లేకుండా వడ్లను కొనుగోలు చేయాలన్నారు. జిల్లాలో వాహనాలు, గొనె సంచుల కొరత లేకుండా అధికారులు చూడాలని కోరారు. నాయకులు వెంకట్‌గౌడ్, నర్సింలు పాల్గొన్నారు.

సంక్షిప్తం

కరపత్రాల ఆవిష్కరణ

మాచారెడ్డి: మండలంలోని ఎల్లంపేట, సోమారంపేట, రత్నగిరిపల్లి, రాజ్‌ఖాన్‌పేట గ్రామాల్లో ఎమ్మార్పీఎస్ ధర్మ యుద్ధ మహాసభకు సంబంధించిన కరపత్రాలను మండల అధ్యక్షుడు బట్ట రమేశ్ శుక్రవారం ఆవిష్కరించారు. ఈనెల 28న కామారెడ్డిలోని ఈఎస్ఆర్ గార్డెన్‌లో మహాసభ ఉంటుందని ఎమ్మార్పీఎస్ నాయకులు విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు నాగరాజు, కొమ్ము కుమార్, దేవరాజు, లక్ష్మీనర్సు, రాములు, ఎల్లయ్య, శ్రీకాంత్, ఉన్నారు.

ప్లాస్టిక్ వాడొద్దు

లింగంపేట: గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ప్రజలు ప్లాస్టిక్ వినియోగాన్ని నివారించాలని ఎంపీవో మలహరి సూచించారు. శుక్రవారం లింగంపేట మండలం ముంబోజిపేట, జల్దిపల్లి గ్రామాల్లో ప్లాస్టిక్ వాడకం తగ్గించాలని గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఆయన వెంట కార్యదర్శి పవన్‌కుమార్,కారొబార్ గోవింద్‌రావు, గ్రామస్తులు ఉన్నారు.

ఆర్థికసాయం అందజేత

రామారెడ్డి: మండలంలోని ఇసన్నపల్లికి చెందిన మైపాల్ భార్య మృతి చెందింది. బాధిత కుటుంబానికి గ్రామానికి చెందిన లచ్చయ్య రూ.10వేలు,గ్రామ యువత రూ.2500 ఆర్థిక సాయం అందించారు.గ్రామస్తులు, యువకులు ఉన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

ఎల్లారెడ్డిరూరల్: భిక్కనూర్ గ్రామంలోని పలువురి బాధిత కుటుంబాలను కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సాయిబాబా శుక్రవారం పరామర్శించి ఆర్థికసాయం అందజేశారు. పార్టీ నాయకులు, గ్రామస్తులు ఉన్నారు.

తీరనున్న కోతుల బెడద

మాచారెడ్డి: మండలంలోని గజ్యానాయక్ తండా చౌరస్తాలో కోతుల బెడద ఎక్కువైంది. పలువురిపై దాడి చేయడంతో గ్రామస్తులు కోతుల బెడదపై సమావేశమై ఇంటింటికి తిరిగి చందాలు వసూలు చేశారు. శుక్రవారం కోతులను పట్టే వ్యక్తులను తీసుకొచ్చి వాటిని బోనులో బంధించారు.

ప్రభుత్వ పాఠశాలల తనిఖీ

ఎల్లారెడ్డిరూరల్: మండలంలోని పలు గ్రామాల్లో ప్రభుత్వ పాఠశాలలను ఎంఈవో వెంకటేశం శుక్రవారం తనిఖీ చేశారు. మండలంలోని రుద్రారం, జంగమాయిపల్లి, అల్మాజీపూర్, మల్కాపూర్ గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల రికార్డులను తనిఖీ చేశారు. హెచ్‌ఎంలు, సిబ్బంది ఉన్నారు.

విద్యార్థులకు ఆయుధాలపై అవగాహన

బిచ్కుంద: పోలీస్ అమరవీరుల దినోత్సవం సందర్భంగా శుక్రవారం పోలీస్ స్టేషన్‌లో విద్యార్థులకు ఎస్సై మోహన్‌రెడ్డి స్టేషన్‌లోని ఆయుధాలు, చట్టాలపై అవగాహన కల్పించారు. పోలీసు సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు సన్మానం

ఎల్లారెడ్డి: మండలంలోని మల్లయ్యపల్లిలో బదిలీ అయిన ఉపాధ్యాయులు ప్రవీణ్, షాకీర్‌తో పాటు నూతనంగా వచ్చిన విశ్వనాథం, సంతోష్‌లను గ్రామస్తులు శుక్రవారం సన్మానించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచులు ఎల్లయ్య, చంద్రయ్య, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

బాన్సువాడ రూరల్: డీఎస్సీలో జక్కల్‌దాని తండా నుంచి ప్రభుత్వ ఉద్యోగం సాధించిన సంతోష్, జీవన్‌లను గ్రామ ప్రభుత్వ పాఠశాల హెచ్‌ఎం హీరాలాల్ ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వాజీద్ అలీ, అంగన్‌వాడీ టీచర్ సోన, నాయకులు రవి పాల్గొన్నారు.